

వైకుంఠధామం ఆర్చీ పిల్లర్లకు బిగించిన గేటు

# అంత్యక్రియలకు అవస్థలు

- వైకుంఠధామంలో వసతులు కరువు
- అధ్వానంగా కాద్లాపూర్ వైకుంఠధామం

బాన్సువాడ రూరల్, ఫిబ్రవరి 8: మండలంలోని కాద్లాపూర్ గ్రామంలో రూ.12లక్షలతో నిర్మించిన వైకుంఠధామం అధ్వాన స్థితిలో ఉన్నది. వైకుంఠధామంలోకి వెళ్లగానే విరిగిన స్నానాల గది తలుపులు, వాష్‌రూంలో ధ్వంసమైన పైపు లైన్లు, కింద పడ్డ నీటి కుళాయిలు, చుట్టూ మొలిచిన పిచ్చి మొక్కలే దర్శనమిస్తున్నాయి. సరైన సౌకర్యాలు లేక అక్కడ అంత్యక్రియులు చేసేందుకు గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. స్నానాల గది నిర్మించినప్పటికీ పైకప్పు లేకపోవడం గమనార్హం. వైకుంఠధామం నిర్మాణ పనులు నాసిరకంగా చేపట్టడంతో గోడలకు అక్కడక్కడా పగుళ్లు ఏర్పడ్డాయి. వైకుంఠధామం ప్రధాన ద్వారం ఆర్చీకి బిగించిన ప్రధాన గేటును దాని పిల్లర్లలో ఇరికించారు. వైకుంఠధామంలో నీటి పైప్‌లైన్, వాష్ బేసిన్లను పోకిరీలు ధ్వంసం చేసినా పట్టించుకునే వారు లేరు. సంబంధిత అధికారులు చొరవ తీసుకొని వైకుంఠధామంలో నీటి సౌకర్యం, ఇతర వసతులు కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు


స్నానాల గదిలో ధ్వంసం చేసిన నీటి పైప్‌లైన్, వాష్ బేసిన్



## ట్రైనీ అధికారుల గ్రామ సందర్శన



*మాచారెడ్డి మండలంలోని చుక్కాపూర్ గ్రామాన్ని శనివారం అటవీశాఖ ట్రైనీ సెక్షన్ అధికారుల బృందం సందర్శించింది. ఈ సందర్భంగా వానకాలంలో నాటిన మొక్కలను బృందం సభ్యులు పరిశీలించారు. మొక్కలను ఎలా సంరక్షించా లి..? తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటీ అనే అంశాలను ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్ రామకృష్ణ వారికి వివరించారు. కార్యక్రమంలో కామారెడ్డి, మాచారెడ్డి ఎఫ్ఆర్వోలు రమేశ్, దివ్య, సిబ్బంది, 40 మంది ట్రైనీ సెక్షన్ అధికారులు పాల్గొన్నారు.*
*– మాచారెడ్డి, ఫిబ్రవరి 8*

# ఎమ్మెల్సీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్
- పోలింగ్ సిబ్బందికి శిక్షణా తరగతులు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కామారెడ్డి, ఫిబ్రవరి 8: మెదక్ – నిజామాబాద్ – ఆదిలాబాద్ – కరీంనగర్ పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నికల దృష్ట్యా సిబ్బందికి శిక్షణా తరగతులను నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పీవో, ఏపీవో, ఓపీవోలకు మొదటి దఫా శిక్షణా కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికలను పకడ్బందీగా, కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించాలన్నారు. ఎన్నికల కోసం కేటాయించిన సిబ్బంది తమ విధులను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. తమకు తెలిపిన విధంగా శిక్షణా తరగతులకు హాజరు కావాలన్నారు. ప్రిసైడింగ్, పోలింగ్ అధికారులు నిర్వహించాల్సిన విధులు, బాధ్యతలను మాస్టర్ ట్రైనర్లు రామకృష్ణ, లక్ష్మణ్ వివరించారు. రెండో దఫా శిక్షణా తరగతులు త్వరలో ఉంటాయని తెలిపారు. కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఎన్నికల సామగ్రిని పంపిణీ చేస్తారని చెప్పారు. ఎన్నికలు 27వ తేదీన ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఆర్డీవో మన్నె ప్రభాకర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

# వెలమ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

కామారెడ్డి, ఫిబ్రవరి 8: వెలమ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో శనివారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. జిల్లా అధ్యక్షుడిగా గండ్ర మధుసూదన్ రావు, ఉపాధ్యక్షులుగా గౌరినేని మధుసూదన్ రావు, చీటి పాండురంగరావు, జలగం సుజాత, ప్రధాన కార్యదర్శిగా పోనుగోటి రాజ గంభీర్ రావు, కోశాధికారిగా ఐలేని రాజేశ్వర్ రావు, కార్యనిర్వాహక కార్యదర్శిగా చింతలపల్లి శ్రీధర్ రావు, గన్నమనేని వెంకట రామారావు, చీటి పరంధామాలు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మాచారెడ్డి మాజీ ఎంపీపీ లోయపల్లి నర్సింగరావు, దామోదర్ రావు, ఐలేని రవీందర్ రావు, ఐలేని గడీల బాపూరావు, సంజీవరావు, డాక్టర్ దేవేందర్ రావు, కక్కెర అశోక్ రావు తదితరులు పాల్గొన్నారు.


నూతన కార్యవర్గ సభ్యులు వీరే..

## క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం

బాన్సువాడ రూరల్, ఫిబ్రవరి 8: తెలంగాణ రాష్ట్ర బీసీ అధ్యాపకుల సంఘం నూతన సంవత్సర క్యాలెండర్– 2025ను బాన్సువాడలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఆవిష్కరించారు. జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం, స్థానిక అధ్యాపకులతో కలిసి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బీసీ ఉపాధ్యాయ సంఘం ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, అధ్యాపకులు నాగరాజు, శివకుమార్, యాదాగౌడ్, శ్రీనివాస్‌రావు, కార్తీక్, రజాక్, జలీల్ తదితరులు పాల్గొన్నారు.

## రేపు విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

మాచారెడ్డి, ఫిబ్రవరి 8 : మండలంలోని చుక్కాపూర్ గ్రామ శివారులో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఈనెల 10వ తేదీన విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ తిరుపతిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కామారెడ్డి రూరల్ సబ్‌డివిజన్‌లోని మాచారెడ్డి, వెల్పుగొండ(పాల్వంచ), రామారెడ్డి, సదాశివనగర్ మండలాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు ఈ పరిష్కార వేదికకు హాజరు కావాలని సూచించారు. ఉమ్మడి జిల్లా విద్యుత్ అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఉదయం పదిన్నర గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సమావేశం ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## అల్బెండలోల్ మాత్రల పంపిణీ వాయిదా

రాజంపేట్, ఫిబ్రవరి 8: జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా ఈనెల10 తేదీ (సోమవారం)న వేయనున్న అల్బెండజోల్ మాత్రల పంపిణీని తాత్కాలికంగా వాయిదా వేసినట్లు మండల వైద్యాధికారిణి డాక్టర్ విజయలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పంపిణీ కార్యక్రమం ఎప్పుడు నిర్వహించేది త్వరలో ప్రకటిస్తామని వైద్యాధికారిణి పేర్కొన్నారు.

## వాటర్ ప్లాంట్ ప్రారంభం



వాటర్ ప్లాంట్ ప్రారంభించిన అనంతరం పైడి ఎల్లారెడ్డిని జ్ఞాపికతో సన్మానిస్తున్న గ్రామస్తులు

లింగంపేట, ఫిబ్రవరి 8: మండలంలోని పోల్కంపేట గ్రామంలో వాటర్ ప్యూరిఫయర్ ప్లాంట్‌ను ప్రముఖ శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి శుక్రవారం రాత్రి ప్రారంభించారు. గ్రామంలో స్వచ్ఛమైన తాగు నీరు అందించాలనే ఉద్దేశంతో సొంత డబ్బులతో ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు ఆర్థిక సాయం చేసిన పైడి ఎల్లారెడ్డిని గ్రామస్తులు పూలమాలలు వేసి జ్ఞాపిక అందించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పోల్కంపేట గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

## పద్మశాలీ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక


ఎల్లారెడ్డి పట్టణ పద్మశాలీ సంఘం నూతన కార్యవర్గ సభ్యులు

ఎల్లారెడ్డిరూరల్, ఫిబ్రవరి 8: ఎల్లారెడ్డి పట్టణ పద్మశాలీ సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని 10 పాండెల నాయకులు, సభ్యులు కలిసి అధ్యక్షుడిగా విద్యా రవి, ప్రధాన కార్యదర్శులుగా పద్మ కాశీరాం, కేవీ చందు, లక్ష్మీనారాయణ, బాల్‌కిషన్, కోశాధికారిగా గూడ రామకృష్ణ, ఉపాధ్యక్షులుగా సోమేశ్వర్, శ్యాంసుందర్, దుర్గయ్య, నర్సింహులు, సహ కార్యదర్శులుగా శ్రీనివాస్, బిల్ల శ్రీనివాస్, కృష్ణమూర్తి, ఆంజనేయులు, అంజయ్య, ఆడిటర్లుగా బాల్‌కిషన్, రాజు, డైరెక్టర్లుగా శ్రీనివాస్, వెంకటేశం, రాజు, మోహన్, అంబయ్య, శంకర్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే వివేకానందగౌడ్‌కు సన్మానం


ఎమ్మెల్యే వివేకానందగౌడ్‌ను సన్మానిస్తున్న మనోహర్‌రెడ్డి

నాగిరెడ్డిపేట, ఫిబ్రవరి 8: కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానందగౌడ్ బీఆర్ఎస్ అసెంబ్లీ విప్‌గా నియామకం కావడం తో..ఆయన క్యాంపు కార్యాలయంలో నాగిరెడ్డిపేట మాజీ జడ్పీటీసీ, బీఆర్ఎస్ నాయకుడు మనోహర్‌రెడ్డి శనివారం కలిసి సన్మానించారు. మిఠాయిలు తినిపిం చి శుభాకాంక్షలు తెలిపారు.

# తరలిపోయిన వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల

- త్వరలో కళాశాల భవనానికి తాళం?
- 'నమస్తే' హెచ్చరించినా స్పందన కరువు

నాగిరెడ్డిపేట, ఫిబ్రవరి 8: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లోని 10 పాసైన విద్యార్థులకు బంగారు భవిష్యత్తును అందించేందుకు గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన మాల్తుమ్మెద వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల నేడు అధికారుల నిర్లక్ష్యంతో మూత పడింది. గుట్టు చప్పుడు కాకుండా సంఖ్యను తక్కువగా చూపుతూ..కళాశాల విద్యార్థులను తరలించేందుకు ఏర్పాట్లు చేస్తుండడంతో గుర్తించిన 'నమస్తే తెలంగాణ' గత ఏడాది డిసెంబర్ 29న 'మాల్తుమ్మెద వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల నిర్వహణపై నీలినీడలు' కథనం ప్రచురించింది. స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు స్పందించి కళాశాల తరలకుండా చర్యలు తీసుకోవాలని సూచించింది. ఎవరూ నోరు మెదపకపోవడంతో కళాశాల అధికారులు అనుకున్న ప్రకారం విద్యార్థులను సిద్దిపేట జిల్లా తోర్నాల కళాశాలకు తరలించి, అక్కడే ఎన్‌రోల్ మెంట్ పూర్తి చేశారు. కళాశాలలోని తరగతి గదులకు తాళం వేసి చేతులు దులుపుకున్నారు. ఈ విషయమై కళాశాల ప్రిన్సిపాల్ మాధవీలతను వివరణ కోరగా..కేంద్రీయ విశ్వవిద్యాలయ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విద్యార్థులను తోర్నాల కళాశాలకు తరలించి ఎన్‌రోల్‌మెంట్ పూర్తి చేశామన్నారు. కళాశాల పూర్తి స్థాయిలో మూత పడినట్లేనని, ఇక్కడ కృషి విజ్ఞానకేంద్రం ఏర్పాటు కోసం ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.


మాల్తుమ్మెద అగ్రి పాల్‌టెక్నిక్ కళాశాల భవనం

# బైక్‌ను ఢీకొన్న కారు : ఒకరి మృతి

గాంధారి, పిబ్రవరి 8: బైక్‌ను వెనుక నుంచి కారు ఢీకొనడంతో ఒకరు మృతి చెందారు. గాంధారి ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. బాన్సువాడ పట్టణంలో నివాసం ఉండే షేక్ అహ్మద్ (32) పని నిమిత్తం శుక్రవారం రాత్రి తన సొంతూరైన గండివేట్ గ్రామానికి వచ్చాడు. పని ముగించుకొని తిరిగి అర్ధరాత్రి 12 గంటలు దాటిన తర్వాత బైక్‌పై బాన్సువాడకు బయల్దేరాడు. మొండిసడాక్ సమీపంలో దర్గా వద్ద వెనుక నుంచి వచ్చిన కారు వేగంగా బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అహ్మద్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య సమ్రీనాబేగం, ఇద్దరు చిన్నారులు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

### బైక్‌తో చెట్టును ఢీకొట్టి యువకుడు..


ఏగొండ (ఫైల్)

ఎల్లారెడ్డిరూరల్, ఫిబ్రవరి 8: చెట్టును బైక్‌తో ఢీ కొట్టుకొని యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని మీసన్‌పల్లి గ్రామ శివారులో శనివారం చోటు చేసుకున్నది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని భిక్‌నూర్ గ్రామానికి చెందిన చాకలి ఏగొండ (18) ఎల్లారెడ్డి నుంచి భిక్‌నూర్‌కు బైక్‌పై వెళ్తున్నాడు. మీసన్‌పల్లి శివారుకు చేరుకోగానే అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును బైక్‌తో ఢీకొట్టి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు మృతుడి కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారమందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని ఎల్లారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడి తండ్రి రెండు నెలల క్రితం మరణించడం, వెంటనే ఏగొండ చిన్నతనంలోనే ప్రమాదంలో మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# తపాలా శాఖలో పథకాలపై అవగాహన

నాగిరెడ్డిపేట, ఫిబ్రవరి 8: మండలంలోని మాల్తుమ్మెద గ్రామంలో తపాలా శాఖలో అమలు చేస్తున్న పథకాలపై పోస్టల్ సిబ్బంది శనివారం ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించారు. తపాలా శాఖలో ప్రజల సంక్షేమం కోసం చేపడుతున్న పథకాలను వివరించారు. చిన్న, చిన్న పొదుపులే రేపటి మీ కుటుంబాల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తాయన్నారు. రికరింగ్ డిపాజిట్, సేవింగ్ బ్యాంకు, సుకన్య సమృద్ధి యోజన, రూరల్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్సు, పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్సు పథకాల్లో చేరితే కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో బీపీఎంలు గోపాల్, రాజేందర్, నాగరాజు, జాఫర్, నరేందర్, నందిని, పూజిత తదితరులు పాల్గొన్నారు.


మాల్తుమ్మెదలో ఇంటింటికీ వెళ్లి తపాల శాఖ పథకాలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ఎల్లారెడ్డి రూరల్, ఫిబ్రవరి 8: మండలంలోని రుద్రారం గ్రామంలో సీసీ రోడ్డు పనులను శనివారం ప్రారంభించారు. గ్రామంలోని బీసీ కాలనీలో 5 లక్షల రూపాయల నిధులతో స్థానిక నాయకులు పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు రుక్మారెడ్డి, సత్యం, భాగేశ్, హసన్, పర్వతంరెడ్డి, బాల్‌రాజ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు కంటి పరీక్షలు

గాంధారి, పిబ్రవరి 8: మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ పాఠశాల విద్యార్థులకు జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా నేత్ర వైద్య సహాయ అధికారి హరికృష్ణ పాఠశాలలోని విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, 35 మందికి కంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. సమస్యలు ఉన్న వారికి అద్దాలను రిఫర్ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సురేశ్ చంద్రసిర్వీ, ఏఎన్ఎం షబానా తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి పన్ను బకాయిల వసూలు

ఎల్లారెడ్డి రూరల్, ఫిబ్రవరి 8: పట్టణంలో మున్సిపల్ సిబ్బంది ఇంటి బకాయిలను శనివారం వసూలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2024–25 సంవత్సరానికి గాను పెండింగ్‌లో ఉన్న ఇంటి పన్ను, నల్లా బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు. మధ్యాహ్నం వరకు రూ.14వేల ఇంటి బకాయిలు వసూలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వార్డు ఆఫీసర్లు అంజయ్య, గంగారాం, బిల్ కలెక్టర్ రాజు, అటెండర్ విజయ్‌రావు ఉన్నారు.

## పాస్టర్స్ కార్యవర్గం ఎన్నిక

లింగంపేట, ఫిబ్రవరి 8: మండల పాస్టర్స్ కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రంలోని చర్చిలో ప్రత్యేక సమావేశం నిర్వహించి ఎన్నుకున్నారు. మండల శాఖ అధ్యక్షుడిగా డీ మోషే (ఎక్కపల్లి), ప్రధాన కార్యదర్శిగా మహేశ్ (భవానీపేట), సహాయ కార్యదర్శిగా స్టేజర్ జాన్‌మార్క్(నల్లమడుగు)ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండలంలోని ఆయా గ్రామాల పాస్టర్లు పాల్గొన్నారు.

## పంటల వివరాలను నమోదు చేసుకోవాలి


యాసంగి పంటల నమోదును పరిశీలిస్తున్న ఏవో రాజలింగం

గాంధారి, పిబ్రవరి 8: యాసంగిలో రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి రాజలింగం సూచించారు. పంటల నమోదు కార్యక్రమంలో భాగంగా వ్యవసాయాధికారులు మండలంలో క్లస్టర్ల వారీగా ఏఈవోలు ఆయా గ్రామాల్లో రైతులు సాగు చేసిన పంటలు పరిశీలించి నమోదు చేస్తున్నారు. మండల కేంద్రంలో శనివారం చేపట్టిన పంటల నమోదును ఏవో పరిశీలించారు.

## గుర్తుతెలియని ద్విచక్ర వాహనం..?

లింగంపేట(తాడ్వాయి), ఫిబ్రవరి 8: తాడ్వాయి మండలంలోని కృష్ణాజివాడి గ్రామంలో ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు వదిలి వెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామంలోని లక్ష్మి నరసింహా మెడికల్ షాప్ వద్ద గుర్తు తెలియని వ్యక్తులు ఏపీ 25 ఎఫ్ 5905 నంబర్ ఉన్న ద్విచక్ర వాహనం వదిలి వెళ్లినట్లు తెలిపారు. వారం రోజులుగా పార్కింగ్ చేసిన చోటనే ఉన్నదన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకు వచ్చి వదిలేసి వెళ్లారా? అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.


కృష్ణాజివాడిలో గుర్తించిన ద్విచక్ర వాహనం

## ఆర్గానిక్ వ్యవసాయంపై విద్యార్థులకు అవగాహన

రామారెడ్డి (సదాశివనగర్), ఫిబ్రవరి 8 : సదాశివనగర్ మోడల్ స్కూల్ విద్యార్థులు ఫీల్డ్ విజిట్‌లో భాగంగా శనివారం రుద్రూర్ కృషి విజ్ఞాన కేంద్రాన్ని సందర్శించారు. విద్యార్థులకు అక్కడి సిబ్బంది శ్రీకాంత్ హార్టికల్చర్, ఆర్గానిక్ వ్యవసాయం, వర్మీకంపోస్ట్ తయారీ విధానం, నూతన వ్యవసాయ సాగు పద్ధతులపై అవగాహన కల్పించారు. విద్యార్థులు అక్కడి నుంచి అక్బర్‌నగర్‌లో ఉన్న ప్రకృతి చికిత్సాలయాన్ని సందర్శించారు. అక్కడ ఆరోగ్య పద్ధతులు, పౌష్టికాహారం, ఆరోగ్య సూత్రాల గురించి తెలుసుకున్నారు. విద్యార్థులు ఆరోగ్య పద్ధతులు పాటించడం వల్ల చక్కటి ఆరోగ్యంతోపాటు ఏకాగ్రత, చదువుపై శ్రద్ధ పెరుగుతుందని ప్రిన్సిపాల్ రాజిరెడ్డి పేర్కొన్నారు.


వర్మీ కంపోస్ట్ గురించి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

## తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలి

లింగంపేట, ఫిబ్రవరి 8: గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో నరేశ్ గ్రామ కార్యదర్శులకు సూచించారు. మండలంలోని నల్లమడుగు, నల్లమడుగు పెద్ద తండా, లింగంపల్లి, ముస్తాపూర్, ఎల్లారం తదితర గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో తాగునీటిని సరఫరా చేసే ట్యాంకులు శుభ్రం చేయించి, వాటి పరిసరాల్లోని పిచ్చి మొక్కలను తొలగింపజేశారు. ఎంపీడీవో వెంట ఎంపీవో మల్హరీ, గ్రామ కార్యదర్శులు ఉన్నారు.